క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


సురేందర్‌రెడ్డి (ఫైల్‌)

సోన్‌: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్‌ కథనం ప్రకారం..పాక్‌పట్ల గ్రామానికి చెందిన నల్ల సురేందర్‌రెడ్డి (38) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. భార్య రజిత, కుమారుడు ఇంటర్‌ సెకండియర్‌, కుమార్తె ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నారు. గతకొన్నేళ్ల నుంచి సురేందర్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. వ్యవసాయ పనులు ముగించుకుని భార్య రజిత సాయంత్రం ఇంటికి చేరుకుంది. అప్పటికే సురేందర్‌ రెడ్డి అపస్మారక స్థితిలో వెళ్లాడు. ఆమె బంధువులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని అతన్ని నిర్మల్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హనుమాన్‌ ఆలయంలో చోరీ

ముథోల్‌: మండలంలోరి గన్నోర గ్రామ సమీపంలోని పల్లె హనుమాన్‌ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారని గ్రామస్తులు శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయికిరణ్‌ అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ రప్పించి వేలిముద్రలు సేకరించారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసారూరల్‌: మండలంలోని కుంసర గ్రామంలో షార్ట్‌ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధమైంది. గ్రామానికి చెందిన గంగాధర్‌పటేల్‌ ఐదెకరాల్లో మొక్కజొన్న వేశాడు. పంట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద షార్ట్‌ సర్క్యూట్‌తో శుక్రవారం మొక్కజొన్నకు నిప్పంటుకుని కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఎకరం పంట పూర్తిగా కాలిపోగా, 20 క్వింటాళ్ల మొక్కజొన్న బూడిదైంది. పంటను చూసి కుటుంబీకులు రోదించారు.

రెండు బైక్‌ల చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని టూటౌన్‌ పరిధిలో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. విద్యానగర్‌కు చెందిన సంతోష్‌ గతనెల 26న రాత్రి 7గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట పార్కింగ్‌ చేశాడు. తెల్లారక చూస్తే బైక్‌ కనిపించకపోవడంతో పలుచోట్ల గాలించినా దొరకలేదు. శుక్రవారం టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గాంధీనగర్‌కు చెందిన కాంబ్లే నితిన్‌ తన ఇంటి ఎదుట ఈనెల 7న బైక్‌ పార్కింగ్‌ చేయగా తెల్లరేసరికి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెయ్యి ఎకరాల్లో పంట నష్టం

- సర్వేలో తేల్చిన వ్యవసాయశాఖ
- 33 శాతం నష్టం ఉంటేనే సర్వే
- అధికంగా దెబ్బతిన్న మొక్కజొన్న

(బోథ్‌, నేరడిగొండ మండలాల్లో..)

గ్రామాలు:	34
నష్టపోయిన రైతులు:	733

పంటల నష్టం ఎకరాలు

మొక్కజొన్న	727
జొన్న	214
గోధుమ	13
నువ్వులు	2
కొత్తిమీర	30
మిగతావి	18
మొత్తం	1004


సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్‌)

బోథ్‌: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో గత నెలలో కురిసిన వడగళ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం అందిస్తామని సీఎం కేసీఆర్‌ ప్రకటించారు. ఈ మేరకు పంట నష్టంపై సర్వే చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బోథ్‌, నేరడిగొండ మండలాల్లో సాంకేతికతను ఉపయోగించి అధికారులు చేపట్టిన సర్వే ఇటీవల పూర్తయింది. జిల్లాలో 1,004 ఎకరాల్లో పంటల నష్టం..

జిల్లాలో బోథ్‌, నేరడిగొండ మండలాల్లో పంట నష్టంపై అధికారులు సర్వే చేపట్టారు. మొత్తం 34 గ్రామాల్లో 733 మంది రైతుల పంటలను పరిశీలించి 1,004 ఎకరాల్లో నష్టం జరిగిందని సర్వేలో తేల్చారు. బోథ్‌ మండలంలోని 23 గ్రామాల్లో 502 మంది పొలాలను సర్వే చేపట్టగా 791 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నేరడిగొండ మండలంలోని 11 గ్రామాలకు చెందిన 231 రైతుల పంటలను పరిశీలించగా 213 ఎకరాలకు నష్టం వాటిల్లిందని గుర్తించారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు.

మండలాల్లో..

బోథ్‌ మండలంలో 520 ఎకరాల్లో మొక్కజొన్న, 211 ఎకరాల్లో జొన్న దెబ్బతింది. నేరడిగొండ మండలంలో 207 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. సర్వేలో రైతులకు సంబంధించిన ఆధార్‌ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాపాస్‌ బుక్‌ వివరాలు సేకరించారు. ఇందులో ప్రత్యేకంగా కౌలు రైతుల వివరాలను నమోదు చేశారు.

ప్రభుత్వ నిబంధనపై అభ్యంతరం

ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతం కన్నా ఎక్కువగా దెబ్బతిన్న పంటలను మాత్రమే అధికారులు సర్వే చేపట్టారు. అంతకన్నా పంటలు తక్కువగా దెబ్బతినడంతో సర్వే నిర్వహించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట దెబ్బతిన్నదా లేదా అనేది చూడాలే కాని 33 శాతం నిబంధన పెట్టడం పట్ల వారు అభ్యంతరం తెలుపుతున్నారు. ఒకవేళ 33 శాతం కన్నా తక్కువ దెబ్బతిన్న పంటలు లెక్కిస్తే దాదాపు మరో వెయ్యి ఎకరాలు నష్టం సర్వేలో వచ్చే అవకాశం ఉండేది.

నివేదించాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటల సర్వేను పూర్తి చేశాం. బోథ్‌, నేరడిగొండ మండలాల్లో 1,004 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఈ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. మొక్కజొన్న అధిక మొత్తంలో దెబ్బతింది. ప్రభుత్వం నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో వేసే అవకాశం ఉంది.
– శ్రీధర్‌స్వామి, ఏడీఏ, బోథ్‌

రిమ్స్‌ గైనిక్‌ వార్డులో డైరెక్టర్‌ విచారణ

- ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు


బాధితురాలితో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్‌ గోవర్ధన్‌రెడ్డి

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌టౌన్‌: 'రిమ్స్‌ నుంచి వెళ్లగొడితే ప్రైవేట్‌లో ప్రసవం..చేతిలో చిల్లిగవ్వలేక విలపించిన భర్త' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ స్పందించారు. గైనిక్‌ వార్డును పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది ఎవరు ఉన్నారు, ఏం జరిగిందనే వాటిపై ఆరా తీశారు. ఈ సంఘటనకు సంబంధించి విచారణ చేపట్టేందుకు ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు చేపడుతామన్నారు.

బాధితురాలిని పరామర్శించిన డీసీసీబీ డైరెక్టర్‌..

రిమ్స్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి డీసీసీబీ డైరెక్టర్‌ బాలూరి గోవర్ధన్‌ బాధితురాలిని పరామర్శించారు. ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ప్రసవమైన బాధితురాలు శిరీష ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పుట్టినబిడ్డ ఆరోగ్యం గురించి వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారిద్దరు ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు సూచించారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రికి సోషల్‌ మీడియా ద్వారా పంపించారు. విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

అనుమానాస్పదంగా యువతి మృతి


కౌశల్య మృతదేహం

బేల: ఓ యువతి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన మండలంలోని దుబ్బగూడ(ఎస్‌) గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కుమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లా సిర్పూర్‌ మండలం బాబ్జిపేట్‌కు చెందిన జుజ్నక్‌ మారుబాయి, భీంరావుల పెద్ద కూతురు కౌశల్య(28), బేల మండలం దుబ్బగూడ(ఎస్‌) గ్రామానికి చెందిన మరప కౌశిక్‌రావు కుమారుడు నాగోరావు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల వీరు ఇరువురు కుటుంబ సభ్యుల సమక్షంలో ఈనెల 15న పెళ్లి నిర్ణయించారు. ఈ క్రమంలో దుబ్బగూడ(ఎస్‌)లో నివాసం ఉన్న ఆమె నోటిలో నురగతో శుక్రవారం నిద్రలేచే సమయానికి మృతిచెంది కనిపించింది. ఈ విషయాన్ని స్థానిక గ్రామపటేల్‌ ఆత్రం లక్ష్మణ్‌, బాబ్జిపేట్‌ గ్రామపటేల్‌ సోయం మోతిరామ్‌కు ఫోన్‌ చేసి కౌశల్య పాముకాటుతో మృతిచెందిందని తెలిపాడు. మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, అక్కడి వారంతా విగతజీవిగా ఆమెను చూసి, మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.కృష్ణకుమార్‌ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య


రామ్మోహన్‌ (ఫైల్‌)

నర్సాపూర్‌(జి): మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై దేవేందర్‌ గౌడ్‌ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దండ్ల రామ్మోహన్‌ (35), లక్ష్మి భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. రామ్మోహన్‌ కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్య లక్ష్మితో గొడవలు జరుగుతుండేవి. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో 15 రోజుల క్రితం లక్ష్మి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య రాలేదని మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'రాజ్యాంగాన్ని మార్చే కుట్ర'


వర్షంలో మాట్లాడుతున్న మందకృష్ణ


విగ్రహాలు ఆవిష్కరిస్తున్న మందకృష్ణ, ఖాసీం

- ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

బోథ్‌: దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పేర్కొన్నారు. జనాభా ప్రకారం తమ వాటా తేల్చాలని డిమాండ్‌ చేశారు. బోథ్‌ మండలంలోని పొచ్చెర గ్రామంలో మహాత్మాజ్యోతిబాపూలే, అంబేద్కర్‌, బాబూ జగ్జీవన్‌, కుమురం భీం విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. విద్యలో, సంపదలో, రాజకీయంలో అణగారిన వర్గాలకు వాటా అందకుండా చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. పోరాటం చేయకపోతే ఊర్లలో ఉన్నవారు ఊరి బయట బతకాల్సి వస్తోందన్నారు. మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వచ్చిన తెలంగాణ దొరల తెలంగాణ అయ్యిందని అన్నారు. చదువు మాత్రమే బడుగు బలహీన వర్గాలకు దిక్సూచని అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు.

పోరాటమే పరిష్కారం: ఓయూ ప్రొఫెసర్‌ ఖాసీం

బడుగు, బలహీన వర్గాలను అణచివేస్తున్న ప్రభుత్వాలపై పోరాటం, చదువే ఆయుధమని ఓయూ ప్రొఫెసర్‌ ఖాసీం అన్నారు. అంబేద్కర్‌, మహాత్మా జ్యోతిబాపూలే, బాబూ జగ్జీవన్‌, కుమురం భీం జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ఆటాపాటలతో, ప్రజల ఉద్యమాలతో తెచ్చిన తెలంగాణ దొరల పాలైందని గాయకుడు ఏపూరి సోమన్న పేర్కొన్నాడు. కాగా వర్షం కురిసినా ప్రసంగాలను ప్రజలు కుర్చీలను తమ నెత్తిన పెట్టుకుని విన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు కుడాల స్వామి, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్‌, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బురుగ పొచ్చన్న, ప్రజా గాయకుడు గిద్దె రాంనర్సయ్య, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గణేశ్‌, ఎంపీపీ తుల శ్రీనివాస్‌, కరీంనగర్‌ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్‌ తుల ఉమ, నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే ఫీజు తీసుకోం

- ప్రైవేటు హాస్పిటల్‌లో ప్రత్యేక అవకాశం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని కోణార్క్‌ ఎస్‌బీఆర్‌ హాస్పిటల్‌లో కాన్పు కోసం వచ్చే వారికి ఆడపిల్ల పుడితే ఉచిత డెలివరీ చేస్తామని యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. బాలికా వృద్ధిరేటు పెంపొందించే క్రమంలో తమవంతు ప్రోత్సాహకంగా హాస్పిటల్‌లో ప్రత్యేక అవకాశం కల్పిస్తోందని తెలిపింది. ఈనెల 15 నుంచి జులై 15 వరకు ఈ అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరింది. సాధారణ ప్రసవం లేదా సిజేరియన్‌ డెలివరీలో ఆడపిల్ల పుడితే ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా డెలివరీ చేస్తామని వైద్యులు, గైనకాలజిస్ట్‌ డా.యూ.శోభాసు భాష్‌రావు తెలిపారు. వైద్య వృత్తిలో 30 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ అవకాశం కల్పించామన్నారు.

ఎక్సైజ్‌ పోలీసుల విధులకు ఆటంకం

- ఇద్దరిపై కేసు

తాంసి: ఎక్సైజ్‌ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై భీంపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాధిక కథనం ప్రకారం.. గురువారం రాత్రి భీంపూర్‌ మండలం వడూర్‌ గ్రామంలో మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తరలిస్తున్నారని ఎక్సైజ్‌ పోలీసులకు సమాచారం అందింది. గ్రామానికి చెందిన అగ్గు తానోబా దేశీదారు విక్రయిస్తూ ఎక్సైజ్‌ సిబ్బంది సుధాం, శ్రీధర్‌, ధన్‌రాజ్‌కు పట్టుబడ్డాడు. అతని ఇంటి వద్ద 330 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తానోబా తోపాటు స్వాధీనం చేసుకున్న దేశీదారును ఎక్సైజ్‌ పోలీసులు తరలించే క్రమంలో అదే గ్రామానికి చెందిన అగ్గు అశోక్‌ అడ్డుకొని వారితో వాగ్వాదానికి దిగాడు. తానోబా, అశోక్‌లు దేశీదారు సీసాలను ఎత్తుకెళ్లారు. ఎక్సైజ్‌ పోలీసు హెడ్‌ కానిస్టేబుల్‌ సుధాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరుములు మెరుపులతో వర్షం

- గుత్పాలలో పిడుగుపాటు
- తప్పిన ప్రమాదం


కురుస్తున్న వర్షం

నేరడిగొండ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆయా చోట్ల ఈదురుగాలులతోపాటు చినుకులు కురిశాయి. రోల్‌మామడ నుంచి గొడం లక్ష్మణ్‌ గుత్పాల గ్రామానికి వెళ్తుండగా పిడుగు పడడంతో పెను ప్రమాదం తప్పింది. నేరడిగొండకు వచ్చిన ఆయన బైక్‌పై వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. ఆయా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో చిన్నపాటి వర్షం పడింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

నిర్మల్‌లో అకాల వర్షం

నిర్మల్‌చైన్‌గేట్‌: జిల్లాలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. రెండు రోజులుగా భానుడి ప్రతాపంతో తల్లడిల్లిన జనం ఆకాశం మేఘావతమై వర్షం కురియడంతో చల్లబడ్డ వాతావరణంతో ఊరట చెందారు. మరికొన్ని రోజుల్లో పంట చేతికి వస్తుందనే క్రమంలో వర్షం కురవడం అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. జిల్లా కేంద్రంలో పలుచోట్ల ప్రధాన రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో చెరువులు, కుంటలను తలపించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి


తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న నర్సింహారావు

తానూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి నర్సింహారావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

లంపీస్కిన్‌తో లేగదూడ మృతి


లేగదూడ మృతదేహం

సారంగపూర్‌: మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో దశరథ లస్మయ్యకు చెందిన లేగదూడ లంపీస్కిన్‌తో గురువారం మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన దాదాపు నలుగురు రైతుల ఆవులు ఇదివరకే చనిపోయాయి. అయినా పశువైద్యాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అబలకు అండగా 'సఖీ'

- బాధితులకు తోడుగా..పరిష్కార దిశగా (వన్‌స్టాఫ్‌) సేవలు
- అవగాహన కార్యక్రమాలు చేపడుతూ..
- సత్ఫలితాలిస్తోన్న 'సఖి'


గ్రామీణ ప్రాంతాల్లో సఖీ సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది (ఫైల్‌)

గుడిహత్నూర్‌: వివిధ రకాలుగా వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలకు అండగా నిలుస్తోంది 'సఖీ' కేంద్రం. బాధితులెందరినో చేరదీసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోంది. మారుమూల గ్రామాల్లో సేవలందించడంతో సత్ఫలితాలిస్తోంది. పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతూ అబలల్లో చైతన్యం కల్గిస్తోంది. బాధితులకు ప్రత్యేక నిపుణులతో కౌన్సెలింగ్‌ నిర్వహిస్తూ ధైర్యం నింపుతున్న 'సఖీ' సేవలపై ప్రత్యేక కథనం.

జిల్లాలో..

2017 నుంచి నేటి వరకు సఖీలో నమోదైన కేసులు	: 1474
ఇప్పటివరకు రాజీకుదిర్చినవి	: 975
వీటిలో అత్యధికంగా నమోదైనవి గృహ హింస కేసులు	: 325
పెండింగ్‌లో ఉన్నవి	: 473
సామాజిక కౌన్సిలింగ్‌ నిర్వహించినవి	: 1713
న్యాయ సేవలందించినవి	: 445
వైద్య సేవలందించినవి	: 164
పోలీసుల సహాయం తీసుకున్నవి	: 152
సఖీ కేంద్రంలో ఆశ్రయం పొందిన వారి సంఖ్య	: 317

సమస్య ఏదైనా మార్గం సఖీ.. వన్‌స్టాప్‌ సెంటర్‌

గత 2017లో ఆవిర్భవించిన 'సఖీ' బాధితులకు సేవలందింస్తోంది. సమాజంలో, కుటుంబాల్లో, పని చేసే ప్రదేశాల్లో, చదువుకునే ప్రదేశాల్లో మహిళలు, బాలికలు మానసికంగా, లైంగికంగా, ఆర్థికంగా, వివక్షతో కూడిన హింసలకు గురవుతున్నారు. నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమవుతుంటారు. ఎవరికీ చెప్పుకోలేక మదన పడుతూ ఉంటారు. ప్రధానంగా గృహ హింస, వరకట్నం, లైంగిక వేధింపులు, ప్రేమ వివాహాలు, బాల్య వివాహాలు, ప్రేమ పేర మోసపోవడాలు, చిన్నారులను దత్తత తీసుకోవడంలో తదితర సమస్యలు. తల్లిదండ్రులు పిల్లలకు బాల్య వివాహాలు చేస్తూ వైవాహిక జీవితంలో అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటా రు. ఇలాంటి వారికి సఖీ అండగా నిలుస్తోంది.

హెల్ప్‌లైన్‌ సహాయం..

మహిళలు, బాలికల పట్ల ఎలాంటి సమస్య తలెత్తినా 24 గంటలు పని చేసే హెల్ప్‌లైన్‌ నంబర్‌ 181 ఉంది. ఫోన్‌ చేసి సంప్రదిస్తే సరి.. బాధితులకు తక్షణ సాయం అందించడానికి సఖీ టీం, రంగంలో దిగుతోంది. మరో ఫోన్‌ నంబర్‌ 08732-223272 ఆశ్రయించాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఫోన్‌ చేసి సహాయం కోరే పరిస్థితి లేని సమయంలో సమాచారం గోప్యంగా ఉంచి బాధితులను ఆదుకోవడం లక్ష్యంగా సఖీ పనిచేస్తోంది. అదే సమయంలో బాధిత మహిళల/బాలికను తమ వాహనంలో రెస్క్యూ చేసి కేంద్రానికి తరలించి దుస్తులు, భోజన వసతి, కనీస అవసరాల కిట్లు అందజేస్తోంది. వీటిలో దుస్తులు, సబ్బులు, ఇతర అవసరాల సామగ్రి ఉంటుంది. బాధితుల తరపున సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతోంది.

బాధితుల తరఫున న్యాయ పోరాటం

బాధితుల తరఫున న్యాయ సహాయ చర్యలు సఖీ తీసుకుంటుంది. కొన్ని కేసుల్లో బాధిత మహిళలకు వారి కుటుంబ సభ్యులకు జరిగిన అన్యాయంపై నిష్పక్షపాతంగా రాజీ కుదుర్చుతుంది. లేకపోతే సమస్యను బట్టి సఖీ తమ న్యాయనిపుణులతో చర్చించి వారిపై కేసులు నమోదు చేయడం వారి తరఫున న్యాయం జరిగేలా చూస్తుంది.

ఆపదలో ఒకే ఒక్క కాల్‌ చాలు



ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు, చిన్నారులు ఫోన్‌ చేసి సాయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. కేవలం ఒకే ఒక్క కాల్‌ చాలు. సఖీ ద్వారా వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఆపదలో ఉన్నవారు 181కు ఉచిత ఫోన్‌ చేస్తే సరిపోతుంది. అన్ని మేమే చూసుకుంటాం.
– జి.సరస్వతి, సెంటర్‌ అడ్మినిస్ట్రేటర్‌ సఖీ వన్‌స్టాప్‌ సెంటర్‌, ఆదిలాబాద్‌

మహిళలకు అండగా ఉంటాం



మహిళలకు అండగా ఉంటాం. వారికి ఎలాంటి సమస్య ఎదురైనా సఖీ కేంద్రం ద్వారా ఇరువర్గాలకు అవగాహన కల్పించి సయోధ్యతో వారి జీవితాలను సరిచేస్తాం. కౌన్సెలింగ్‌ నిర్వహించి సరైన పరిష్కారంతోపాటు న్యాయం జరిగేలా చూస్తాం. – మిల్కా, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి, ఆదిలాబాద్‌

సాక్షి
నిర్మల్
ఆదివారం, 16, ఏప్రిల్, 2023



'భారత దర్శన్'తో సంస్కృతి ఏకీకరణ

భారతీయ సంస్కృతి ఏకీకరణకు భారత్ దర్శన్ యాత్ర కీలకం కానుందని బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. ఈ యాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. 8లో▸

18న పీడీఎస్ బియ్యం వేలం

నిర్మల్‌చైన్‌గేట్: పౌరసరఫరా, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 18న వేలం వేయనున్నట్లు కలెక్టర్, పౌర సరఫరా శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా ఎంఎల్ఎస్ పాయింట్‌లో 54.028 మెట్రిక్ టన్నులు, నిర్మల్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో 109.725 మెట్రిక్ టన్నులు ముథోల్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో 17.012 మెట్రిక్ టన్నులు ఖానాపూర్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో 11.150 మెట్రిక్ టన్నులు భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.5 /26.4

ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:33	సోమ : 4:34

న్యూస్‌రీల్

ఉమ్రి(కె) పల్లె ప్రకృతి వనానికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రత్నమాల

తానూరు: హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో శనివారం జరిగిన ఏడో గార్డెన్ ఫెస్టివల్‌లో వివిధ విభాగాల్లో అవార్డులను ప్రదానం చేశారు. పల్లె ప్రకృతివనం విభాగంలో తానూరు మండలం ఉమ్రి(కె) గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ హన్మంత్‌రావ్ చేతుల మీదుగా ఉమ్రి(కె) సర్పంచ్ రత్నమాల అవార్డు అందుకున్నారు. మియావాకి పద్ధతిలో పల్లె ప్రకృతివనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కుమార్‌ను హన్మంత్‌రావ్ అభినందించారు.

సీహెచ్‌సీని సందర్శించిన 'లక్ష్య' బృందం



కేంద్ర బృందంతో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది

సర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను నేషనల్ ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్ లో భాగంగా 'లక్ష్య'(లేబర్ రూమ్ క్వాలిటీ ఇంప్రూమెంట్ ఇనిషియేటివ్) బృందం సభ్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ లీస్మా శుక్ర, శని రెండు రోజులపాటు సందర్శించారు. సీహెచ్‌సీలోని లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌తోపాటు గైనిక్ రిజిస్ట్రేషన్, ఓపీ, స్కానింగ్ విభాగాలను పరిశీలించారు. మాతా శిశు ఆరోగ్య సేవల్లో నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. సోపర్ట్ సర్వీసెస్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, సర్వీస్ ప్రొవిజన్, ఇన్‌పుట్, ఔట్ కం, పేషంట్ కేర్, గర్భిణీలు, బాలింతల రికార్డుల నిర్వహణ, వసతులు, వైద్య సిబ్బంది పనితీరు క్షుణ్ణంగా పరిశీలించారు. బృందం సభ్యులు సంతృప్తి చెందితే కేంద్రానికి నివేదించనున్నారు. తద్వారా ఆసుపత్రి పురస్కారానికి ఎంపికయ్యే ఆస్కారం ఉంది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ముఖేశ్, జిల్లా క్వాలిటీ మేనేజర్ సయ్యద్ రిజ్వాన్, డాక్టర్లు శైలజ, సరోజ, సాయికృష్ణ, వరుణ్, శ్రీధర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ ఎంపీని కలిసిన 'ఏలేటి'



ధర్మపురి అరవింద్‌ను సన్మానిస్తున్న ఏలేటి

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్: ఇటీవల బీజేపీలో చేరిన నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైదరా బాదులో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని శనివారం విడివిడిగా కలిశారు. వారికి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట ముధోల్ బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్, నాందేడపు చిన్ను, తొక్కల రమణారెడ్డి ఉన్నారు.

బాధ్యతల నుంచి పార్‌పెల్లి ఉప సర్పంచ్ తొలగింపు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఉప సర్పంచ్ విద్యాసాగర్‌రెడ్డిని పదవి నుంచి తొలగించినట్లు డీపీవో శ్రీలత తెలిపారు. సర్పంచ్ విద్యాసాగర్‌రెడ్డిపై వార్డు సభ్యులు అప్పటి ఆర్డీవో తుక్కారం సమక్షంలో అవిశ్వాసం పెట్ట గా అందులో నెగ్గడంతో అప్పుడు ఉప సర్పంచ్ ను తొలగించారు. అయితే ఉప సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాడు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్ట్ విద్యాసాగర్‌రెడ్డి తొలగింపు సబబే అని తీర్పు ఇచ్చినట్లు డీపీవో శ్రీలత తెలిపారు. హైకోర్ట్ ఆదేశాలతో ఉప సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

నిప్పు.. రగిలితే ముప్పు!



ఖానాపూర్‌లో షెడ్డు లేక రోడ్డుపై నిలిపిన ఫైర్ ఇంజిన్

- నిబంధనలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు దూరం
- వేసవి దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి
- గతేడాది జిల్లాలో 202 ప్రమాదాలు
- రూ.2.10 కోట్ల ఆస్తి నష్టం
- ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు



శివాజీ చౌక్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: అగ్ని ప్రమాదం బతుకులను బుగ్గి చేస్తోంది. తీరని ఆస్తి నష్టం మిగులుస్తోంది. ముఖ్యంగా వేసవిలో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించుకోవచ్చంటున్నారు అధికారులు. అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గతేడాది అగ్నిప్రమాదాలు...

- నిర్మల్ పరిధిలో 57 అగ్ని ప్రమాదాలు జరిగాయి. రూ.67.82 లక్షలు నష్టం వాటిల్లింది. రూ.225.08 లక్షల విలువైన ఆస్తిని ఫైర్ సిబ్బంది కాపాడారు.
- భైంసా పరిధిలో 74 అగ్ని ప్రమాదాలు జరుగగా.. రూ.106.78 లక్షల నష్టం జరిగింది. రూ.730.3 లక్షల విలువైన ఆస్తిని రక్షించారు.
- ఖానాపూర్ పరిధిలో 71 అగ్ని ప్రమాదాలు జరుగగా రూ.35 లక్షలు నష్టం వాటిల్లింది. రూ.179.4 లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్లు అధికాలు వెల్లడించారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం అరకొర వసతుల కొట్టుమిట్టాడుతోంది. ఆరేళ్లుగా శాశ్వత షెడ్డు లేక మార్కెట్ యార్డులోనే ఒక మూలన పార్కు చేసి ఉంటుంది. దీనికంటూ తాత్కాలిక షెడ్డు అంటూ ఏమీ లేదు. కేంద్రం పరిధిలో 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 2008 ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు.

గతేడాది వివరాలు

ఫైర్ స్టేషన్	వచ్చిన కాల్స్	నష్టపోయిన ఆస్తి(రూ.లక్షల్లో)	కాపాడిన ఆస్తి(రూ.లక్షల్లో)
నిర్మల్	57	68.82	225.08
భైంసా	74	106.7	730.3
ఖానాపూర్	71	35	179



ఫైర్ స్టేషన్ అధికారుల నంబర్లు

నిర్మల్	7981483939
ఖానాపూర్	8712699223
భైంసా	8712699221

వారం రోజుల ప్రణాళిక...

14న మంటలు ఆర్పే సందర్భంలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పిస్తారు. కేంద్రాల్లో అగ్నిమాపక యంత్రాల ప్రదర్శన

15న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, మార్కెట్లు, మాల్స్, సినిమా థియేటర్లు, స్లమ్ ఏరియాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ప్రదర్శనలు

16న ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు, ప్రథమ చికిత్సపై శిక్షణ

17న బహుళ అంతస్తు భవన కాలనీల్లో గ్యాస్, విద్యుత్తు, పొగ, అగ్ని ప్రమాదాలపై అవగాహన

18న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, ఎల్పీజీ నిల్వ గోదాముల్లో ఫైర్ డ్రిల్, ప్రథమ చికిత్స, అగ్నిపై పోరాటం వంటి అంశాలపై శిక్షణ

19న వ్యాపార భవనాలు, ఫంక్షన్ హాళ్లు, విద్యా సంస్థలు, మాల్స్, సినిమా థియేటర్లలో శిక్షణ

20న అగ్ని ప్రమాదాల రక్షణపై ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి సదస్సులు నిర్వహిస్తారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.

జాగ్రత్తలు ఇలా..

- అగ్ని ప్రమాదాలు ఎక్కువగా వేసవిలో సంభవిస్తుంటాయి. బహుళ అంతస్తు భవనా లు, గ్యాస్ సిలిండర్లు, టపాసులు పరిశ్రమలు, గోదాములు, ఇతర రసాయన నిల్వ లు ఉండే ప్రాంతాల్లో జరిగే అగ్ని ప్రమాదాలతో ఆస్తి, ప్రాణనష్టం అధికంగా జరుగుతోంది. పూరి గుడిసెలు, గడ్డివాములు వంటి ప్రాంతాలు, ఎండిన పచ్చిక, అటవీ ప్రాంతాల్లో మంటలు వేగంగా విస్తరిస్తా యి. ఇటువంటి సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.
- సులభంగా మండే పదార్థాలను మంటలకు దూరంగా ఉంచాలి.
- చమురు, గ్యాస్, రసాయనాల లీకేజీని సమర్థంగా అరికట్టాలి. లీకైన పదార్థాలను వెంటనే తుడిచి శుభ్రం చేయాలి.
- వివిధ రకాల రసాయనాలను దూరంగా నిల్వ చేయాలి.
- అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించాలి.
- గడ్డి వాములు విద్యుత్ వైర్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉంచాలి. లేదంటే తీగలు తగిలి, ట్రాన్స్‌ఫార్మర్‌లో చిన్న లోపాలు తలెత్తిన సమయంలో నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగే అవకాశం ఉంది.
- పొలాల్లో పంటలు చేతికొచ్చిన తర్వాత మిగిలిన చెత్తకు రైతులు నిప్పుపెడతారు. కానీ మంటలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండడంతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.
- వేసవిలో అధికంగా విద్యుత్ వినియోగం ఉంటుంది. ఆ సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగే చాన్స్ ఉంది. ఇలాంటివి జరుగకుండా ముందుగా విద్యుత్ పైపులు, కరెంట్ వైర్లు, స్విచ్ బోర్డులు కరెక్ట్‌గా ఉన్నాయా లేదా చెక్ చేసుకోవాలి. అనుమానాలు ఉంటే మరమ్మతు చేయించాలి.
- చార్జింగ్ బ్యాటరీ వాహనాలపై జాగ్రత్తగా ఉండాలి. వాహనం నడిపి ఇంటికి వచ్చిన వెంటనే చార్జింగ్ పెట్టొద్దు.

ముందస్తు చర్యలతోనే నివారణ...



అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటే అగ్ని ప్రమాదాల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యల్లో ప్రతీ శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎలాంటి ప్రమాదాలు జరిగినా కాల్‌సెంటర్ 101 సంప్రదించాలి.

– బి.చరణ్ కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి, భైంసా

అప్రమత్తంగా ఉందాం...



భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు రసాయనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలి. అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే పదార్థాలను జాగ్రత్తగా నిల్వ చేయాలి. రెండేళ్లకోసారి థర్డ్ పార్టీ ఫైర్ ఆడిట్ చేయించి, వారి సూచనలు పాటించాలి. ప్రమాదం జరిగిన వెంటనే దూరంగా జరిగి 101కి సమాచారం అందించాలి.

– వెంకటేశ్వర్లు, అగ్నిమాపకశాఖ అధికారి, ఖానాపూర్...

అగ్ని ప్రమాదాలను నివారించే దిశగా..



అగ్ని ప్రమాదాలను నివారించే దిశగా వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు వివరిస్తున్నాం. జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పిస్తాం. ముందస్తు జాగ్రత్తలతోనే ప్రమాదాలను నివారించవచ్చు. అగ్ని ప్రమాదం జరిగి వెంటనే సమాచారమివ్వాలి.

– జయత్‌రామ్, అగ్నిమాపక శాఖ అధికారి, నిర్మల్

లంపీస్కిన్ కట్టడేది?

- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- మళ్లీ టీకాలు వేయాలని కోరుతున్న పశుపోషకులు



లంపీస్కిన్ వ్యాధితో మృతిచెందిన లేగదూడ

సారంగపూర్: పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి జిల్లాలో తీవ్రరూపం దాలుస్తోంది. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో పశువులు ఈవ్యాధిబారిన పడి మృత్యువాత పడగా, చాలా పశువులు వ్యాధితో బాధపడుతున్నాయి. మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన దశరథ లస్మయ్య అనే రైతుకు చెందిన సుమారు 8 నెలల లేగదూడ లంపీస్కిన్ వ్యాధితో మృతిచెందింది. మరో ఇద్దరు రైతులు కూడా మృత్యువాత పడ్డాయి. ఇవి కూడా ఆరు నెలలు పైబడినవే. టీకాలు వేసి ఉంటే వ్యాధిసోకేది కాదని రైతులు అంటున్నారు. గత సెప్టెంబర్‌లో ఈవ్యాధి తీవ్ర రూపం దాల్చడంతో అప్రమత్తమైన అధికారులు సారంగాపూర్ మండలంలో 14 వేల పశువులకు టీకాలు వేశారు. తర్వాత వ్యాధితీవ్రత తగ్గడంతో టీకాల పంపిణీ నిలిపివేశారు. తాజాగా కొత్తగా పుట్టిన లేగదూడలు లంపీస్కిన్ బారిన పడుతున్నాయి.

టీకాలు వేయకపోవడంతో..

లంపీస్కిన్ వ్యాధి అప్పుడే పుట్టిన పశువులకు సైతం సోకుతోంది. దీంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. టీకాలు ఆరునెలలు పైబడిన పశువులకు మాత్రమే వేయించాలని అధికారులు చెబుతుండగా ప్రస్తుతం పుట్టిన లేగదూడలు, కోడె దూడలకు వ్యాధిసోకి మృత్యువాత పడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే పశువులకు టీకాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి..

ఆరు నెలలలోపు పశువులకు లంపీస్కిన్ టీకాలు వేయడం కుదరదు. రైతులు వ్యాధిసోకిన వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించి తగిన వైద్యం అందిస్తే ఫలితం ఉంటుంది. వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. ఆరునెలలు పైబడిన వాటికి రైతులు విధిగా టీకాలు వేయించాలి. లేదంటే వ్యాధిసోకే ప్రమాదం ఉంది.

– ముక్తార్, పశువైద్యాధికారి, సారంగాపూర్

18న జాబ్ మేళా

నిర్మల్‌చైన్‌గేట్: నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు ఈనెల 18న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి గణేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి సంబంధించి పదో తరగతి లేదా ఇంటర్ ఫెయిల్ లేక పాసై ఉండాలని పేర్కొన్నారు. వేతనం రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో నిర్మల్ ఉపాధి కల్పన కార్యాలయానికి ఈనెల 18న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. సమాచారం కోసం 9494010807, 9182590222 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చి'వరి'కి అందని నీరు



సదర్మాట్ వద్ద ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న నీళ్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వరి పంట కడెం మండలం పెద్దూర్ తండాలోనిది. సదర్మాట్ చివరి ఆయకట్టుకు కొన్ని రోజులుగా నీరందడం లేదు. దీంతో పొలం ఇలా ఎండిపోతోంది. ఆయకట్టు చివరి పొలాలన్నీ ఇలాగే ఉన్నాయి. అధికారులు స్పందించి నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

- ఎండుతున్న సదర్మాట్ ఆయకట్టు
- తడి కోసం తండ్లాడుతున్న రైతులు
- పట్టించుకోని నీటిపారుదల అధికారులు

కడెం: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి లభ్యత ఉండటంతో యాసంగి పంటలకు సైతం సాగునీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. దీంతో సదర్మాట్ ఆయకట్టు రైతులు యాసంగి పంటలు సాగు చేశారు. అయితే కొన్ని రోజులుగా సదర్మాట్ చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు నీటి కోసం కాలువల వెంట తిరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎండుతున్న పంటలు

సదర్మాట్ ఆయకట్టు కింద కడెం మండలం లింగాపూర్, ఎలగడప, సారంగపూర్, పాతమద్దిపడగ, కొత్తమద్దిపడగ, మాసాయిపేట్, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజీపేట్, పెద్దూర్‌తండా, చిట్యాల్ గ్రామాల్లో ఆరు వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. అధికారుల సూచనల మేరకు యాసంగిలో రైతుల వరి సాగుచేశారు. అయితే కొన్ని రోజులుగా చివరి ఆయకట్టు వరకు నీళ్లు రావడం లేదు. దీంతో పొలాలు నోళ్లు తెరుస్తున్నాయి. పంటలు ఎండిపోతున్నారు.

నీరంతా గోదారిపాలు

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు సదర్మాట్ వాల్ దెబ్బతినడంతో.. యాసంగి సీజన్ ప్రారంభంలో అధికారులు దెబ్బతిన్న చోటా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఆ ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో, నీరంతా గోదావరిలో కలుస్తోంది. మరోవైపు గేట్ల నుంచి పూర్తి స్థాయిలో నీళ్లు ఆయకట్టుకు వెళ్లడం లేదు. సదర్మాట్ నుంచి వెళ్లే కొద్దిపాటి నీళ్లు కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు చోట్ల నీళ్లు వృథాగా పోతున్నాయి. సదర్మాట్ వద్ద నీటి వృథాను అరికడితే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందుతుందని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు సదర్మాట్ ఆయకట్టుకు ఎగువన ఉన్న వేములకుర్తి, ఇబ్రహీంపట్నం గ్రామలకు చెందిన రైతులు గోదావరి నీటికి అడ్డుకట్టలు వేయడంతో సదర్మాట్‌కు ప్రవాహం తగ్గింది. దీంతో ఆయకట్టుకు నీరందుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట ఎండుతోంది..



యాసంగిలో సదర్మాట్ కాలువ కింద ఏడు ఎకరాల్లో వరి వేసిన. కాలువ నీళ్లందక పంట ఎండుతోంది. సాగునీరు పూర్తి స్థాయిలో అందకపోతే పంట ఎండిపోయి నష్టపోతాం.

– వేణుగోపాల్, రైతు, పెద్దూర్‌తండా

అధికారులు స్పందించాలి..



సదర్మాట్ వద్ద పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో అక్కడ నీరంతా వృథాగా పోతోంది. చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలి.

– ధర్మాజీ కిష్టయ్య, రైతు, చిట్యాల్

ఉన్నతాధికారుల దృష్టికి..



యాసంగి ప్రారంభంలో సదర్మాట్ వాల్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడంతో నీరు వృథాగా పోతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రవికుమార్, ఏఈఈ సదర్మాట్

పారదర్శకంగా 'రేషన్'

- ఇకనుంచి నిరంతర పర్యవేక్షణ
- జిల్లాలో మానిటరింగ్ కమిటీలు
- గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకూ..
- మూడు నెలలకోసారి సమీక్ష
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



జిల్లాలోని మండలాలు	18
గ్రామపంచాయతీలు	396
మున్సిపాలిటీలు	3
రేషన్‌షాపులు	412
రేషన్‌కార్డులు	2,08,743
లబ్ధిదారులు	6,44,249
బియ్యం కోట	34,676.35 క్వింటాళ్లు

నిర్మల్‌చైన్‌గేట్: రేషన్ అక్రమ రవాణాకు ఇక అడ్డుకట్ట పడనుంది. లబ్ధిదారులకు పీడీఎస్ బియ్యం సక్రమంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టాయి. ఆహార భద్రత పథకాన్ని మరింత పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో మూడు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల ద్వారా డివిజన్, మండల, గ్రామ స్థాయిలో మానిటరింగ్ చేస్తారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తారు. ఆహార భద్రత కార్డులున్న వారందరికీ రేషన్ సరుకులు సక్రమంగా అందేలా ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీల ఏర్పాటుకు సివిల్ సప్లయ్ అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

మూడు నెలలకోసారి సమీక్ష

జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మానిటరింగ్ కమిటీల్లో ఆయా శాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు చోటు కల్పించనున్నారు. కమిటీల ఆధ్వర్యంలో ప్రతీ మూడు నెలలకోసారి రేషన్ సరఫరాపై సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలోని విజిలెన్స్ కమిటీలకు సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. వార్డు సభ్యులు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. రేషన్ డీలర్, అంగన్‌వాడీ టీచర్, ఆర్ఐ, ఐదుగురు రేషన్ లబ్ధిదారులకు కమిటీలో చోటు కల్పించనున్నారు.

జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీలో..

విజిలెన్స్ కమిటీకి జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా జెడ్పీ సీఈవో, డీఈవో, ఐసీడీఎస్ అధికారి, డీటీడీవో, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి, జిల్లా లీగల్ మెథడాలజీ అధికారి, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌తో పాటు ఇద్దరు జెడ్పీటీసీలకు కమిటీలో అవకాశం కల్పించనున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. రేషన్ దుకాణాలు, కిరోసిన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి కూడా కమిటీలో చోటు కల్పించనున్నారు. ఈ కమిటీకి సివిల్ సప్లయ్ జిల్లా అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఆయన ఆధ్వర్యంలో మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహిస్తారు.

డివిజన్ స్థాయిలో ఇలా..

డివిజన్ కమిటీలో అదనపు కలెక్టర్ లేదా ఆర్డీవో చైర్మన్‌గా ఉంటారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఏవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, జెడ్పీటీసీలు, మండల అధికారులు, ఐసీడీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల అధికారులు, సివిల్ సప్లయ్ నాయబ్ తహసీల్దార్లు సభ్యులుగా ఉంటారు. రేషన్ దుకాణాల డీలర్ల సంఘం మండల అధ్యక్షుడితో పాటు ఆర్డీవో నియమించిన మరో ఇద్దరు ఎస్సీ, ఎస్టీ సభ్యులకు కమిటీలో అవకాశం కల్పించనున్నారు.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకుల ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీవో) కె. గోపీచంద్‌ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాల గడువు ఆదివారంతో ముగియనుందని, ఇంకా ఎవరైనా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వారు ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెసిడెన్షియల్‌ జూనియర్‌ కాలేజ్‌ (ఆర్‌జెసి), రెసిడెన్షియల్‌ డిగ్రీ కాలేజ్‌ (ఆర్‌డీసీ)లకు మే 30న ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

గుండెనొప్పితో మహిళ మృతి

జైపూర్‌: గుండెపోటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చెన్న పోసమ్మ (38) నస్పూర్‌లోని కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్యాగ్రహ బహిరంగ సభకు వెళ్లింది. తిరిగి రాత్రి బస్సులో ఇంటికి చేరుకుంది. ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజయ్య, కొడుకు శేఖర్, కూతురు లక్ష్మి ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలు

కడెం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష పడింది. ఆయా గ్రామాలకు చెందిన కాంబ్లే బాలాజీ, రాజేశ్వర్, రఘులను శనివారం ఖానాపూర్‌ ఫస్ట్‌క్లాస్‌ జ్యుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ జితిన్‌కుమార్‌ ఎదుట హాజరు పరుచారు. వారికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

నేడు 'సేంద్రియం'పై ప్రత్యేక కార్యక్రమం

ఎదులాపురం: ఆదిలాబాద్‌ 100.2 ఎంఎఫ్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రసారమయ్యే ఇల్లు ఎవుసం కార్యక్రమంలో 'సేంద్రియ వ్యవసాయం- అవగాహన'' కార్యక్రమం ప్రసారం చేస్తున్నట్లు ప్రోగ్రాం హెడ్‌ రామేశ్వర్‌ కేంద్రే ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం విషయ నిపుణులు ఎం.రఘువీర్‌తో ముచ్చట కార్యక్రమం ఉంటుందని, శ్రోతలు సద్వినియోగించుకుని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్‌పై కేసు



ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్సై

కుంటాల: మండలంలోని ఓల, లింబా(కే) గ్రామాల మధ్య శనివారం ఎస్సై హన్మండ్లు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. లింబా(కే) నుంచి కుంటాల వెళ్తున్న ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఆటో డ్రైవర్‌ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



అటవీశాఖ వాహనాన్ని కల్వర్టులోకి తోసేసిన స్మగ్లర్లు (ఫైల్)



అడ్డొస్తే.. దాడులే

- మితిమీరుతున్న కలప స్మగ్లర్ల ఆగడాలు
- అటవీశాఖ సిబ్బందిపై దాడులు
- వారంలో రూ.8లక్షల కలప పట్టివేత
- 12మంది కేసులు నమోదు
- స్మగ్లర్లంతా నేర ప్రవృత్తి కలిగిన వారే..

ఇచ్చోడ: ఆదిలాబాద్‌ జిల్లాలో కలప స్మగ్లర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. అడ్డొచ్చిన వారిపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కలప రవాణే జీవనాధారంగా మార్చుకున్న స్మగ్లర్లు అడ్డొచ్చిన అటవీశాఖ అధికారుల అడ్డుతొలగించుకోవడానికి ఎంతకైనా తెగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సీఎం కేసీఆర్‌ అక్రమ కలప రవాణా నియంత్రణపై సీరియస్‌గా దృష్టి సారించాలని, అడవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్‌ పడింది. కానీ గత ఐదారు నెలల నుంచి కలప దందా గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతోంది.

అడ్డొచ్చిన వారిపై దాడులు...

అక్రమంగా కలప దందా చేసే స్మగ్లర్లంతా నేరప్రవృత్తి కలిగిన వారే. స్మగ్లింగ్‌కు అడ్డొచ్చిన సిబ్బందిపై దాడులు చేయడం వారికి కొత్తేమి కాదు. గతంలో అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గత కొన్నేళ్ల నుంచి ఆదిలాబాద్‌ జిల్లాల్లో ఇచ్చోడ కేంద్రంగా సాగుతున్న కలప దందాకు పాల్పడిన స్మగ్లర్లపై ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్‌ పోలీస్‌స్టేషన్లలో 2వేల మందిపై కేసులు నమోదయ్యాయి.

పట్టుబడుతున్న కలప

వారం రోజుల వ్యవధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.8లక్షల కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ నెల 7న నేరడిగొండ మండలంలోని నాగమల్యాల్‌లో తనిఖీలు నిర్వహించగా రూ.50వేల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8న ఇంద్రవెల్లి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.5లక్షల విలువ చేసే కలప పట్టుబడింది. అలాగే ఈ నెల 13న గుడిహత్నూర్‌ మండలంలో రూ. 2.50 లక్షల కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు.

12 మందిపై కేసు.

ఇటీవల కాలంలో కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న 12మంది పై కేసులు నమెదు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. కేసులు నమోదైన 12మంది సైతం ఒకే వర్గానికి చెందిన కలప స్మగ్లర్లు కావడం గమనార్హం.

పీడీ యాక్ట్‌ నమోదు చేస్తాం



కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్‌ కేసులు నమోదు చేస్తాం. కలప స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా ఎవరైనా కలప తరలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేయాలి.

– బార్నోబా, ఎఫ్‌డీవో, ఇచ్చోడ

అటవీ సిబ్బందిపై జరిగిన దాడులు..

- ఈ నెల 9న ఇంద్రవెల్లి మండలం నుంచి ఐచర్‌ వాహనంలో కలప తరలిస్తున్నట్లు సమాచారం మేరకు అటవీశాఖ ఆధికారులు గుడిహత్నూర్‌ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనం పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐచర్‌ వ్యాన్‌తో అటవీశాఖ సిబ్బందిని ఢీకొట్టి ప్రయత్నం చేశారు. ఈ సంఘటలో సిబ్బంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.
- ఐదు రోజుల క్రితం టైగర్‌జోన్‌ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకుంటే ఎఫ్‌ఆర్వోపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్వోకు గాయాలయ్యాయి.
- ఆరు నెలల క్రితం అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను పట్టుకోగా స్మగ్లర్లు సిబ్బందిపై దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటనలో సిబ్బందిలోని ఒకరిది చేతి విరిగింది.

మురళీధర్‌రావుకు సన్మానం



మురళీధర్‌రావును సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు

సోన్‌: బీజేపి జాతీయ నాయకులు మధ్యప్రదేశ్‌ రాష్ట్ర బీజేపి ఇన్‌చార్జి మురళీధర్‌ రావును జిల్లా బీజేపి నాయకులు సన్మానించారు .భారత్‌ దర్శన్‌ యాత్రలో భాగంగా శనివారం ఉజ్జయిని మహంకాళీ వెళ్తున్న మురళీధర్‌రావు సోన్‌ మండలంలోని కడ్తాల్‌ వద్ద జిల్లా బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించారు. ఇందులో బీజేపి జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, నాయకులు పార్లమెంట్‌ కన్వీనర్‌ అయ్యన్న భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ భూక్య జానుబాయి, బీజేపీ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు సాగర్, నాయకులు నర్సాగౌడ్, అంజుకుమార్‌ రెడ్డి, కమల్‌ నయన్, రాజేందర్, ప్రేమ్‌కుమార్‌ ఉన్నారు.

కలప పట్టివేత

బోథ్‌: మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో రూ.10వేలు విలువ చేసే కలపను శనివారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. డీఆర్‌వో ప్రమోద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంబ్లె మాదవ్‌ ఇంటి వద్ద అక్రమంగా కలప నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో అటవీశాఖ సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. అనంతరం మాదవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

దాడి చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాష్‌ తెలిపారు. అంబేద్కర్‌ జయంతి సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించగా మహిళలు నృత్యాలు చేశారు. ఈ సమయంలో సుందరయ్యనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్‌ సజ్జద్‌ వారి మధ్యలోకి వెళ్లి డ్యాన్స్‌ చేశాడు. దీంతో ఖుర్షీద్‌ నగర్‌కు చెందిన కాంబ్లే రోహిత్‌ మహిళల మధ్యలో డ్యాన్స్‌ చేయవద్దని సూచించడంతో బయటకు వచ్చాడు. సాయంత్రం రోహిత్‌ ఇంటికి వెళ్తున్న సమయంలో మమత జిన్నింగ్‌ వద్ద ఆయనపై సజ్జద్‌ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్థలం కేటాయిస్తే ఆస్పత్రి నిర్మిస్తాం



ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న జాయింట్‌ కమిషనర్‌ రమేశ్‌

ఇచ్చోడ: ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే ఇచ్చోడలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించడానికి వైద్యా ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని ఆ శాఖ జాయింట్‌ కమిషనర్‌ డాక్టర్‌ రమేశ్‌ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఏటా ఆరోగ్య కేంద్రం వర్షాకాలంలో నీట మునిగిపోతోందని, దీంతో రోగులు, సిబ్బంది సైతం ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆరోగ్య శాఖకు కేటాయిస్తే ఇచ్చోడలో 30 పడకల ఆస్పత్రి నిర్మించడానికి వైద్యాఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మేజర్‌ పంచాయతీ ఉప సర్పంచ్‌ లోక శిరీష్‌రెడ్డి, అడిషనల్‌ డీఎంహెచ్‌వో సాధన, వైద్యాధికారి సాగర్‌ ఉన్నారు.

'భారత దర్శన్‌'తో సంస్కృతి ఏకీకరణ

- బీజేపీ మధ్యప్రదేశ్‌ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

ఆదిలాబాద్‌: భారత్‌ దర్శన్‌ యాత్ర భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని బీజేపీ జాతీయనేత, పార్టీ మధ్యప్రదేశ్‌ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. భారతీయ సంస్కృతి ఏకీకరణకు ఈ యాత్ర కీలకం కానుందన్నారు. ఏక్‌ భారత్‌ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా హైదరాబాద్‌ నుంచి ప్రారంభమైన యాత్రం శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రానికి చేరుకుంది. పార్టీ ఆధ్వర్యంలో వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌ రావు మాట్లాడారు. భారత దేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నెలవన్నారు. ప్రతీ సంస్కృతి తనదైన ప్రత్యేకత చాటుతోందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతోనే భారత్‌ దర్శన్‌ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో మేధావులు, శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు సుమారు 400 మంది పాల్గొంటున్నారని చెప్పారు. భాగ్యనగర్‌ నుంచి ప్రారంభమైన యాత్ర మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని వరకు కొనసాగుతుందన్నారు. ఏప్రిల్‌ 21న యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, ఆదినాథ్, దినేష్‌ మటోలియా, లోక ప్రవీణ్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, కృష్ణ యాదవ్, రత్నాకర్‌రెడ్డి, మయూర్‌ చంద్ర, ముకుంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదంలో ఇరువర్గాలపై కేసు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై విక్రమ్‌



కోలూరు గ్రామానికి చేరుకున్న ఆర్డీవో, తహసీల్దార్‌

తానూరు: అంబేద్కర్‌ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. ఈ సంఘటన మండలంలోని కోలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కోలూరు బస్టాండ్‌ ప్రాంతంలో అంబేద్కర్‌ జయంతి సందర్భంగా ఓ వర్గానికి చెందిన కొంతమంది ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో మరో వర్గానికి కొందరు నాయకులు దాని పక్కనే మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దానిపై అంబేద్కర్‌ చిత్రపటంతో పాటు రాజకీయ నాయకుల ఫొటోలు ఉండడంతో గ్రామంలోని కొందరు యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్‌ చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. శనివారం ఉదయం సీఐ వినోద్‌ గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గొడవకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భైంసా ఆర్డీవో రవి, తహసీల్దార్‌ వెంకటరమణ, ఆర్‌ఐ గంగాధర్‌ గ్రామానికి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్‌: అంబేద్కర్‌ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన ర్యాలీలో ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వర్గానికి చెందిన యువకుడు కాషాయజెండాతో ర్యాలీలో పాల్గొనగా మరో వర్గానికి చెందిన కొంతమంది యువకులు ఆ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొనగా ఉదయం బీజేపీ నాయకులతో పాటు బాధిత యువకులు వన్‌టౌన్‌ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

- హిందువులపై దాడి సరికాదు
- హిందూ సంఘాల డిమాండ్‌
- జిల్లా కేంద్రంలో రాస్తారోకో



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్‌



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌: హిందువులపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆసుపత్రి ఎదుట శనివారం రాస్తారోకో నిర్వహించారు. నిందితులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలి రావడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా హిందూ సంఘం నాయకుడు రాళ్ల బండి మహేందర్‌ మాట్లాడుతూ అంబేద్కర్‌ జయంతి ఉత్సవ ర్యాలీలో భాగంగా కాషాయపు జెండాను ప్రదర్శించిన యువకులపై పలువురు యువకులు దాడి చేశారని మండిపడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. పోలీసులు చేరుకుని వారిని అరెస్ట్‌ చేయడానికి ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అరెస్ట్‌ చేసిన వారిని వ్యాన్‌లో తరలించడానికి పోలీసులు ప్రయత్నించగా వ్యాన్‌కు అడ్డంగా కూర్చొని యువకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డీఎస్పీ ఉమేందర్‌ ఆందోళనకారులను సముదాయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ముగ్గురిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని వెల్లడించారు. అనంతరం శాంతించిన నిరసనకారులు టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ వద్దకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టూ టౌన్‌ లో డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ తైవార్, షాహిద్, అబ్బు అనే నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగతా వారిని సైతం వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని సుహాసిని రెడ్డి, లాలా మున్నా, రఘుపతి, రాకేష్, మహేందర్‌ పాల్గొన్నారు.

30 మందిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్‌: శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేశారని టూ టౌన్‌ పోలీసులు 30 మందిపై శనివారం కేసు నమోదు చేశారు. రిమ్స్‌ ఆసుపత్రి ఎదుట శుక్రవారం జరిగిన ఘటనకు నిరసనగా ఆందోళన చేపట్టగా పోలీసులు వారికి నచ్చజెప్పిన వినకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్‌ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన గౌరు సాయికిరణ్‌(23) ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్‌ ఎస్సై విష్ణు ప్రకాష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గౌరు విజయలక్ష్మి కుమారుడు సాయి కిరణ్‌ కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. తల్లిని వేధించడంతో ఆమె పిప్పల్‌కోటి గ్రామంలో నివసిస్తోంది. ఇంట్లోని వస్తువులన్నింటినీ అమ్ముకుంటూ మద్యం సేవిస్తున్నాడు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో గత రెండు, మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టులో దూకి వృద్ధుడు..

పెంబికల్‌పేట్‌: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎల్లూర్‌ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం నానయ్య (80) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళ్లినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసికంగా తీవ్రంగా కుంగిపోయి గ్రామ సమీపంలోని బొక్కివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పోశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి మరొకరు..

లక్సెట్టిపేట: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్‌ తెలిపిన వివరాల ప్రకారం... రాచర్ల అజయ్‌ (40) వయస్సు దాటిపోయినా ఇంకా పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసినా వారి వద్ద ఆరా తీసిన ఫలితం కానరాలేదు. శనివారం అంకతివాడ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో అజయ్‌ మృతదేహం కనిపించింది. తండ్రి చిలుకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌ మృతి



రాధేశ్యాం మృతదేహం

గుడిహత్నూర్‌: మండలంలోని డోంగర్‌గావ్‌ వద్ద జాతీయ రహదారి 44పై శనివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో జరిగిన కంటెయినర్‌ ట్రాలీ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్‌ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌ వైపు నుంచి నాగ్‌పూర్‌ వైపు వెళ్తున్న కంటెయినర్‌ ట్రాలీ వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ వస్తున్న డ్రైవర్‌ రాధేశ్యాం(42) మండలంలోని డోంగర్‌గావ్‌ వద్దకు చేరుకోగానే అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో రాధేశ్యాం ఎగిరి పడగా.. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని హైవే అంబులెన్సులో రిమ్స్‌ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్‌.ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.